క్లుప్తంగా

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



సీతారామపురం : ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్ ఫజిహా హెచ్చరించారు. సింగారెడ్డిపల్లి బీసీకాలనీలో సర్వే నంబర్ 96లోని వివాదాస్పద భూమిని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇరువర్గాలను పిలిచి స్థానికుల సమక్షంలో భూవివాదంపై విచారణ జరిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సమస్యలు సృష్టించడం తగదన్నారు. ప్రభుత్వ భూమిలో ని యంత్రాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుభాని, సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో వంశీకృష్ణ ఉన్నారు.

పరామర్శ



కావలి(అల్లూరు): నెల్లూరులోని డీఎస్సార్ న్యూరో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ న్యాయవాది, జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కెనడిని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కావలి వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

సచివాలయంలోని వసతుల పరిశీలన



ఉదయగిరి రూరల్: పట్టణంలోని బిట్–3 సచివాలయాన్ని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గ విజన్ –2047 యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి తనను ప్రత్యేక అధికారిగా నియమించారని తెలిపారు. అందుకు సంబంధించి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎనిమిది మండలాల్లో కార్యక్రమాలను కొనసాగించేందుకు వింజమూరు, ఉదయగిరి సచివాలయాల్లో వసతులను పరిశీలించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆమె వెంట పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, వీఆర్వో బీ వెంకటేశ్వర్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తెలుగుభారతి సేవా సమితి మంచిమాట రేపు

ఆత్మకూరురూరల్: తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న మంచిమాట కార్యక్రమాన్ని పట్టణంలోని చావిడి వద్ద ఉన్న శాఖా గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లుగా ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమవరపు సుబ్బరాయుడు, అన్నపురెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి ప్రధాన వక్తగా జీవిత సరిగమలు అనే అంశంపై ఉపన్యసిస్తారని చెప్పారు. తెలుగుభాషాభిమానులు, పట్టణ ప్రజలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్రిపాడు: మండలంలోని 33/11 కేవీ కృష్ణాపురం, బ్రాహ్మణపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఏ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు



సీతారామపురం : మారంరెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు.. పబ్బులేటిపల్లి నుంచి సీతారామపురానికి వస్తున్న ఆటో మారంరెడ్డిపల్లి సమీపంలో అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయి అదుపుతప్పి హైవే మార్జిన్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో సీతారామపురానికి చెందిన వీరపోగు బాబు, నారాయణ గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

29న కమ్మవారిపాలెం సొసైటీ సర్వజన మహాసభ

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాలెం సొసైటీలో ఈ నెల 29న సర్వజన మహాసభను నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సొసైటీ సభ్యులు, రైతులు హాజరుకావాలని కోరారు.

ప్రజారోగ్యంతో చెలగాటం



చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్న దృశ్యం

- చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు
- పక్కరాష్ట్రాల్లో సేకరణ
- రాత్రి వేళల్లో చెరువుల వద్దకు తరలింపు
- తెలుగు తమ్ముళ్ల అండతో రూ.కోట్లు గడిస్తున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో అధికారులు

సంగం: చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వేస్తున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలను వేయడం నేరమని తెలిసినా కొందరు రైతులు ఆదాయమే పరమావధిగా వినియోగిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు అక్రమార్కులు పక్క రాష్ట్రాల్లో చికెన్ వ్యర్థాలను సేకరించి తెలుగు తమ్ముళ్ల అండదండలతో రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా చెరువుల వద్దకు తరలించి సొమ్ము చేసుకుంటూ ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్నారు. చికెన్ వ్యర్థాలను అడ్డుకుని ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు సైతం మామూళ్ల మత్తులో మునిగిపోయి పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూడు వేల ఎకరాలకుపైె సాగు

సంగం మండలంలోని జెండాదిబ్బ, దువ్వూరు, సిద్దీపురం, అన్నారెడ్డిపాళెం, పడమటిపాళెం, వంగల్లు, తరుణవాయి, గాంధీజనసంఘం, కోలగట్ల పంచాయతీల్లో సుమారు మూడు వేల ఎకరాలకు పైగా చేపలను సాగుచేస్తున్నారు. ప్రధానంగా రూప్‌చంద్, ఫంగస్, గండి, బొచ్చె చేపలను పెంచుతున్నారు. వీటికి వేసే మేత ధరలు పెరగడంతో చేపల రైతులు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు వచ్చే చికెన్ వ్యర్థాలపై దృష్టి సారిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు ఇతర రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను సేకరించి రాత్రి వేళల్లో గుట్టుచప్పుడుగా చేపల చెరువుల వద్దకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

తెలుగు తమ్ముళ్ల అండదండలతో..

చికెన్ వ్యర్థాల వ్యాపారంలో భారీ ఆదాయం వస్తుండడంతో తెలుగు తమ్ముళ్ల దృష్టి దానిపై పడింది. మండలానికి చెందిన ముగ్గురు నాయకులు చికెన్ వ్యర్థాల వ్యాపారులను బెదిరించి తమకు ప్రతినెలా మామూళ్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రతిరోజూ సంగం మండలానికి 15 నుంచి 20 లారీల్లో చికెన్ వ్యర్థాలు వస్తున్నాయి. లారీకి రూ.7వేలు చొప్పున వ్యాపారుల నుంచి ముగ్గురు తమ్ముళ్లు తీసుకుంటున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష నుంచి రూ.1.40లక్షల వరకు ఎలాంటి కష్టం లేకుండా గడిస్తున్నారు.

అధికారులకు వాటా

సంగం మండలంలో బడా నేతలుగా చలామణి అవుతున్న ముగ్గురు తెలుగు తమ్ముళ్లు చికెన్ వ్యర్థాల వ్యాపారుల నుంచి నెలసరి మామూళ్లు తీసుకుంటున్నారు. సంగం పోలీసులు చికెన్ వ్యర్థాలను పట్టుకుంటే బడా నేతలు రంగ ప్రవేశం చేస్తున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ముగ్గురు నేతలు సన్నిహితులు కావడంతో వారితో ఎందుకని పోలీసులు కూడా చికెన్ వ్యర్థాల వాహనాలను చూసీచూడకుండా వదిలేసి నెలసరి మామూళ్లతో తృప్తి పడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు సైతం దినసరి మామూళ్ల వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలు(ఫైల్)

అనారోగ్యానికి మూలం

చికెన్ వ్యర్థాలు తిని పెరిగిన చేపలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రధానంగా ఉదర సంబంధిత వ్యాధులతో పాటు కేన్సర్ వస్తుందని పేర్కొంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే చికెన్ వ్యర్థాలను అడ్డుకోవాల్సిన అన్ని శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

అన్నదాతల ఆందోళన

చేపల గుంతల్లో చికెన్‌వ్యర్థాలు వేయడం వల్ల వాటి పక్కనున్న భూములు సైతం దెబ్బతింటున్నాయి. చేపల గుంతల నుంచి వచ్చే నీటి వల్ల వరిపంట దిగుబడి సక్రమంగా రావడం లేదని రైతులు వాపోతున్నారు. చికెన్ వ్యర్థాలతో నీటి కాలుష్యం ఏర్పడి తమ భూములు నిరుపయోగంగా మారుతున్నాయని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చికెన్ వ్యర్థాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పట్టుబడిన చికెన్ వ్యర్థాలను పూడ్చిపెడుతున్న అధికారులు(ఫైల్)

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని, వారికి ఎవరు అన్యాయం చేసినా వదిలే ప్రసక్తే లేదని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఉదయగిరి నియోజకవర్గ ముఖ్యనేతలు, కార్యకర్తలతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారిని వదలకుండా దర్యాప్తు చేయించి అక్రమాలు, అన్యాయం చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన న్యాయం చేస్తామన్నారు. గ్రామస్థాయిలో పనిచేసిన కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన వారి డేటాతమ వద్ద ఉంటుందని, దాని ఆధారంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చినప్పటికి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల ఉదాసీనతతో ఓటమి చెందామన్నారు. భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. డిసెంబరు 15తేదీలోగా గ్రామ కమిటీలను పూర్తి చేయాలన్నారు. పార్టీ నాయకులు షేక్ అలీఅహ్మద్, పాలూరి మాల్యాద్రిరెడ్డి, మండలాల అధ్యక్షులు కొండా రాజగోపాల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, చిమ్మిలి రాజేంద్ర, కాటం రవీంద్రరెడ్డి, ఎం తిరుపతినాయుడు, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల విద్యుత్ సమస్యను పరిష్కరించండి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి(అల్లూరు): బుడంగుంట దళితవాడవాసుల విద్యుత్ సమస్యను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి ఆర్డీఓ వంశీకృష్ణను కోరారు. శుక్రవారం ఆయన కావలి ఆర్డీఓను కలిసి బుడంగుంట దళితవాడవాసుల విద్యుత్ సమస్యపై చర్చించారు. బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుడంగుంట దళితవాడపై విద్యుత్ శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడి చేసి ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇళ్లలో మగవారు ఎవరూ లేని సమయం చూసి మీటర్లు, వైర్లతో సహా తీసుకెళ్లి దళితవాడను అంధకారంలో ఉంచడం ఎంత వరకు న్యాయమో చెప్పాలన్నారు. విద్యుత్ బిల్లుల సమస్య ఉంటే ముందుగా వారికి తెలియజేసి చర్యలు తీసుకోవాలే తప్ప మూకుమ్మడిగా దాడి చేసి కనెక్షన్లు తొలగించి అంధకారంలో ఉంచడం సరైన పద్ధతి కాదన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆకుల సేవలు మరువలేనివి



నారసింహారెడ్డిని సత్కారిస్తున్న మేకపాటి

ఉదయగిరి: ఉదయగిరి డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా ఆకుల నారసింహారెడ్డి అందించిన సేవలు మరువలేనివని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఆకుల ఉద్యోగ విరమణ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేకపాటి హాజరై మాట్లాడారు. ఉదయగిరి నియోజకవర్గంలో విద్యా వ్యాప్తికి మేకపాటి కుటుంబం ఎంతో కృషి చేసిందని వివరించారు. సుదీర్ఘకాలం అధ్యాపకుడిగా పనిచేస్తున్న నారసింహారెడ్డి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఆయన శేషజీవితం సుఖంగా సాగాలన్నారు. అనంతరం ఆకులను ఘనంగా సన్మానించారు.

క్రీడలతో మానసికోల్లాసం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న తిరుపతయ్య

సీతారామపురం : క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య అన్నారు. స్థానిక ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాపోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు నగదును అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దంతిక జయపాల్, గిరి, కొండయ్య, పిచ్చయ్య, ఓబులేసు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చేపల దొంగ అరెస్ట్



పట్టుబడిన వెంకటేశ్వర్లు

సంగం: గత కొద్ది రోజులుగా చేపల గుంతల్లోని చేపలను దొంగతనం చేస్తున్న ఓ వ్యక్తిని రైతులు శుక్రవారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు..సంగం గ్రామానికి చెందిన ఏసుబాబు బీరాపేరు వద్ద చేపల గుంతలు సాగు చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా తన గుంతల్లోని చేపలు మాయమవుతుండడాన్ని గుర్తించి మనుషులతో నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం సిద్దీపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వల తీసుకొచ్చి చేపలు పడుతుండగా చేపల గుంత వద్ద ఉన్న కాపలాదారుడు పట్టుకున్నాడు. ఏసుబాబుకు సమాచారం ఇవ్వగా వచ్చి వెంకటేశ్వర్లును పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జొన్న పంట సాగుపై అవగాహన

దుత్తలూరు: మండలంలోని లక్ష్మీపురం సచివాలయంలో జొన్న పంట సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కే కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జొన్న పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. గత మూడేళ్లుగా మినుము, పెసర, సెనగ పంటలు సాగు చేస్తున్న రైతులు విభిన్న వాతావరణ పరిస్థితుల కారణంగా నష్టపోతున్నారన్నారు. ఈ పంటలకు ప్రత్యామ్నాయంగా ఎర్రమట్టి నేలల్లో నీటిపారుదల కింద, నల్లరేగడి భూముల్లో వర్షాధారంగా జొన్న పంట సాగుచేసుకోవాలని సూచించారు. జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు నంద్యాల తెల్లజొన్న–5 రకం అనుకూలమని తెలిపారు. 100 రోజులకు కోతకు వస్తుందన్నారు. బెట్టను సైతం తట్టుకుంటుందన్నారు. దిగుబడి ఎకరాకు 18–20 క్వింటాళ్ల వరకు వస్తుందన్నారు. అక్టోబర్ మొదటి వారం నుంచి నవంబర్ చివరి వారంలోగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, దుత్తలూరు ఏఓ సీహెచ్ మదన్‌మోహన్, వీఏఏ దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.340

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.629 లభించింది. వేలానికి 837 బేళ్లు రాగా, 629 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.340, కనిష్టంగా రూ.84, సగటున రూ.195.08 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.345 ధర లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 715 బేళ్లను తీసుకురాగా, 648 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.345, కనిష్టంగా రూ.85, సరాసరిన రూ.214.81 ధర లభించిందని వివరించారు.

పూరిల్లు దగ్ధం



సంగం: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన చెన్నవరప్పాడులోని గిరిజన కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు..చెన్నవరప్పాడు గిరిజన కాలనీకి చెందిన రాగి తేజ పూరింట్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం భార్యతో కలిసి తేజ బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో మంటలు చెలరేగడాన్ని స్థానికులు గుర్తించి తేజకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తేజ వచ్చి చూసేసరికి పూర్తిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లోని చిన్నచిన్న బంగారు వస్తువులు, కొంత నగదు, ఫ్రిడ్జ్, టీవీ సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లినట్లుగా బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు



గాయపడిన కుమార్

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొరిమెర్లకు చెందిన కుమార్ బైక్‌పై బుచ్చిరెడ్డిపాళెం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఉడ్‌హౌస్‌పేట సమీపంలో నెల్లూరు–ముంబయి రోడ్డును దాటుతున్న వ్యక్తిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడి కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడ్ని ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

2వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని వెంకట్రావుపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 2న గంగమ్మ, పోతురాజు విగ్రహాలకు జలాధివాసం, 3న గణపతి పూజ, ధాన్యాధివాసం, పంచామృత స్నపనం, గ్రామోత్సవం, 4న ఆలయ శుద్ధి, మహాగణపతి పూజ, ఉదయం 11.32 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. నెల్లూరుపాళెం ఎస్టీకాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి దోమలతో వ్యాప్తి చెందే డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, బోధకాలు వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలని సూచించారు. పట్టణ హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంపీహెచ్ఏ రవీంద్రరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పొగాకు పంట నియంత్రణపై అవగాహన

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని జువ్వలగుంటపల్లిలో పొగాకు రైతులకు పంట నియంత్రపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయంగా పొగాకు పంటకు డిమాండ్ లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పొగాకుబోర్డు అనుమతించిన మేరకు మాత్రమే సాగు చేపట్టాలని సూచించారు. ఫీల్డ్‌ఆఫీసర్ సంతోష్ మాట్లాడుతూ పొగాకు అధిక విస్తీర్ణంలో సాగు చేయడం వల్ల పెట్టుబడులు పెరిగి నష్టాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వర్షాలకు, తెగుళ్లకు నారుమడులు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

జగన్మాత.. శరణు శరణు



ఆత్మకూరు కాశీనాయన ఆశ్రమంలో ధాన్యలక్ష్మిగా అన్నపూర్ణ



ఆత్మకూరులో అన్నపూర్ణగా జ్వాలాముఖి అమ్మవారు



ఆత్మకూరు శివాలయంలో గాయత్రీదేవిగా అన్నపూర్ణాదేవి

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నారు. అందులో భాగంగా ఐదోరోజు శుక్రవారం అమ్మవారు విశేషాలంకారాల్లో కొలువుదీరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. – సాక్షి, నెట్‌వర్క్



కావలిలో అన్నపూర్ణగా కలుగోళశాంభవి అమ్మవారు



సంగం: సంగమేశ్వరాలయంలో శ్రీలక్ష్మీదేవిగా కామాక్షిదేవి



సంగం: పసుపుకొమ్ములతో కాత్యాయనిగా గంగమ్మ

స్త్రీశక్తి పథకం లెక్కలు కాగితాల్లోనే..

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం లెక్కలు ఆర్టీసీ కాగితాల్లోనే కనిపిస్తోందని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఉదయగిరి డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ పదో మహాసభను శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకంతో కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. ఈ పథకం పుణ్యమా అని ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది కండక్టర్లు సస్పెండ్‌కు గురయ్యారన్నారు. 2017లో చేసిన వేతన సవరణ వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 20 శాతం ఉన్న హెచ్‌ఆర్ఏను 16 శాతానికి తగ్గించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఆర్టీసీకి ప్రత్యక్ష ఆదాయం లేక పలు డిపోల్లో ఆయిల్ కొనుగోలుకు సైతం నగదు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణయ్య, డిపో రీజనల్ బాధ్యులు ఎస్దాని బాషా, కార్యదర్శి రవి, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీఐటీయూ నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ



వరికుంటపాడు: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘ నాయకులు

వరికుంటపాడు: వీరనారి చాకలి ఐలమ్మ రజకుల ఆత్మగౌరవానికి ప్రతీక అని మండల రజక సంఘ అధ్యక్షుడు మాచర్ల గురవయ్య అన్నారు. వరికుంటపాడులో చాకలి ఐలమ్మ జయంతిని రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాచర్ల గురవయ్య మాట్లాడుతూ రజకుల గౌరవం, సమాన హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు. రజకులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని, రజకులకు రావాల్సిన రాయితీలను ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల రజక సంఘ ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు యాదగిరి హజరత్, సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు యాదగిరి ప్రసాద్, యాదగిరి తిరుపాలు, రావేళ్ల మహేష్, మాచర్ల బ్రహ్మయ్య, పెర్లంపాటి గురవయ్య, వీరశేఖర్ పాల్గొన్నారు.

కావలి(అల్లూరు): కావలిలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి రజక సోదరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనియాడారు.